క్లుప్తంగా

అబ్దుల్ కలాంకు నివాళి



అబ్దుల్ కలాం చిత్ర పటంవద్ద నివాళులర్పిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప ఆధ్వర్యంలో కలాం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, మార్కెట్ యార్డు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు వీఎన్‌పల్లెకు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఎస్.పాలగిరి పంచాయతీ పరిధిలోని నేలతిమ్మాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, నీటి శుద్ధి కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఇంటి వద్దే వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సింహాద్రిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ ద్వారా ఇంటి వద్దే వైద్య సేవలు అందుతున్నాయి. గురువారం మండల పరిధిలోని అహోబిలాపురం, రావులకొలను గ్రామాల్లో బిదినంచర్ల పీహెచ్‌సీ డాక్టర్ ఖాజామెయిద్దీన్ జబ్బుల బారినపడిన వ్యక్తులు, నడవలేని వారి ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ దిల్షాద్, ఏఎన్ఎం సుభాషిణి, డీఈఓ సౌభాగ్య, ఆశా కార్యకర్త మాధవీలత, హెల్త్ అసిస్టెంట్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప ఉక్కుపై కేంద్ర వైఖరి సరికాదు



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వ వైఖరి సరికాదని.. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మండిపడ్డారు. పార్లమెంట్ సాక్షిగా సాధ్యం కాదని చెప్పడం దారుణమన్నారు. ఈ విషయమై గురువారం స్థానిక పాతబస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్నారు. కేంద్రంలోని బీజేపీ అధికారంలోనికి వచ్చి 9 సంవత్సరాలు అయిన ఇంత వరకు విభజన చట్టంలోని హామీలను అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. ఉక్కు పరిశ్రమ కోసం యువత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు కృష్ణారెడ్డి, సూరి ,వాసు, నాగేంద్ర ,సుభహాన్ తదితరులు పాల్గొన్నారు.

సమిష్టి కృషితో పనిచేద్దాం

జమ్మలమడుగు : ప్రతి కార్యకర్త కలిసి సమిష్టిగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుందామని టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగుమండల ,పట్టణంలోని టీడీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే కార్యకర్తలకు కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేసుకోవడంతోపాటు స్థానికంగా లేని వారి ఓటర్ల వివరాలను సేకరించి అధికారుల చేత వాటిని తొలగించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సి.శివనాథ్‌రెడ్డి, కాటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె, ఇసుకపల్లె గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను గురువారం డీఎంహెచ్‌ఓ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లోని రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామాల్లో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, ఏఎంఓ వెంకటరెడ్డి, వైద్యాధికారి సమీరాభాను, సీహెచ్‌ఓ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



వల్లూరు : కొలువు దీరిన పీర్లు



కమలాపురం : పెద్దచెప్పలి మఠంలో కొలువుదీరిన పీర్ల వద్ద ఫాతెహా చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



ఎర్రగుంట్లలో పెద్ద పీరు ఊరేగింపు

వల్లూరు : హిందూ ముస్లిం సోదరులందరూ కలిసికట్టుగా జరుపుకునే మొహర్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఏటా మొహర్రం మాసం నెలవంక కన్పించిన పదో రోజు షహదత్ పేరిట పండుగ నిర్వహిస్తారు. అంతకుముందు మూడవ రోజు భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు శుభ్రపరిచిన చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. నిర్దేశిత దినాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగిస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాములందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలతో, కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను నిర్వహిస్తారు. ఈ నెల 29 న మొహర్రంను జరపడానికి నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

■ మొహర్రంను పురస్కరించుకుని మండలంలోని పెద్దపుత్త గ్రామంలో గురువారం సాయంత్రం పీర్ల గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు, పిల్లలు ప్రత్యేకంగా అలంకరించిన పీర్లను పట్టుకుని డప్పు వాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య గ్రామంలోని వీధులలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పీర్ల చావిడి దగ్గర ప్రత్యేక ఫాతెహాలను నిర్వహించి భక్తులకు పంచి పెట్టారు.

ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలిలో కొలువు దీరిన పీర్ల వద్ద ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రంను పురస్కరించుకుని పెద్దచెప్పలిలోని వెంకయ్య, రామయ్య మఠంలో ఏర్పాటు చేసిన పీర్ల వద్దకు గురువారం నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అక్కడి చేరుకున్నారు. పీర్లను దర్శించుకున్నారు. అలాగే నిర్వాహకులకు ఖర్చుల నిమిత్తం రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొహర్రం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. అనంతరం గ్రామంలో పీర్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రఘునాథరెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి,పెద్దచెప్పలి చిన్ని, పి.సుబ్బారెడ్డి, నామాల శేఖర్, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో మొహర్రం వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని పీర్ల చావిడిలో పీర్లు కొలువుదీరాయి. గురువారం పెద్ద పీరును గ్రామంలోని పూర వీధులలో ఘనంగా ఊరేగించారు.

ఎర్రబల్లెలో నూతన పీర్ల చావిడి ప్రారంభం

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె పంచాయతీ ఎర్రబల్లెలో గురువారం సాయంత్రం నూతన పీర్ల చావిడిని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. గతంలో ఇక్కడ ఉన్న పీర్ల చావిడి శిథిలావస్థకు చేరడంతో నూతన పీర్ల చావిడి నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి పీర్ల చావిడులు దోహదపడతాయన్నారు. సర్పంచ్ మౌనిక, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి, కాంట్రాక్టర్ పాపయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన యాప్‌తో విద్యార్థులకు ప్రయోజనం



మార్క్స్ ఫెక్చర్ యాప్‌ను ల్యాప్‌ట్యాబ్‌లో చూపుతున్న విద్యార్థి పఠాన్ ముస్తకీమ్

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో ఫైనలియర్ సీఎస్ఈ చదువుతున్న పఠాన్ ముస్తకీమ్ తన ఆలోచనలతో కోడింగ్ ద్వారా విద్యార్థులకు ఉపయోగపడే నూతన యాప్‌ను కనుగొన్నారని.. ఇది ఎంతో ఉపయోగకరమని లయోలా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బ్రిట్టో పేర్కొన్నారు. గురువారం స్థానిక లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ బ్రిట్టో సమక్షంలో విద్యార్థి పఠాన్ ముస్తకీమ్ తన యాప్ పనితీరు గురించి వివరించారు. ఈ యాప్ ద్వారా పరీక్షల ఫలితాల సమయంలో సర్వర్ ఎంతో బిజీగా ఉన్నప్పటికీ.. ఐదారు నిమిషాలలోనే రిజల్ట్ పొందే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా మార్కులు, శాతం, సబ్జెక్టుల వారీగా వివరాలు తెలుసుకునే వీలుందన్నారు. ఈ యాప్ పేరు మార్క్స్ ఫెక్చర్‌గా ఏర్పాటు చేసి శుక్రవారం లాంచనంగా ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి పఠాన్ ముస్తకీమ్‌ను కరస్పాండెంట్ ఆంటోని స్వామి, వైస్ ప్రిన్సిపల్ విజయ్ రాజు, హెచ్‌ఓడీ విశ్వనాథరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

సమాన పనికి సమాన వేతనం కల్పించాలి



నిరసన తెలుపుతున్న ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు, సిబ్బంది

పులివెందుల రూరల్ : సమాన పనికి సమాన వేతనం కల్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు, సిబ్బంది డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు, కన్వీనర్ జగన్‌మోహన్ రెడ్డిల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు జీపీఎఫ్ పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, ప్రమాదానికి గురైన జూనియర్ లైన్‌మెన్ల గ్రేడ్-2 అసిస్టెంట్లపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద తక్షణమే ఉద్యోగాలు కల్పించాలన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఉద్యోగులు హరిసేవ నాయక్, గురుమోహన్, జగదీశ్వరరెడ్డి, రమేష్, విజయలక్ష్మి ఇంజనీర్లు, లైన్ మెన్లు, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎంపీ చొరవతో ఆలయ నిర్మాణం



ప్రారంభానికి ముస్తాబవుతున్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయం

సింహాద్రిపురం : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో మండల కేంద్రమైన సింహాద్రిపురంలో నూతన ఆలయానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడున్న పురాతన వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి విన్నవించారు. దీనికి ఎంపీ స్పందించి ఆలయ ఎండోమెంట్ కింద రూ.1.20కోట్ల నిధులు విడుదల చేయించి నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నూతన వేణుగోపాలస్వామి ఆలయం 90శాతం పనులు పూర్తయ్యాయని.. త్వరలోనే ప్రారంభానికి ఆలయం ముస్తాబవుతోంది. మండల ప్రజలు ఎంపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతు పక్షపాతి పీఎం నరేంద్ర మోదీ



రైతులకు కిసాన్ సమృద్ధి కేంద్రాల గురించి అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

వేంపల్లె : రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా 1.25లక్షల కిసాన్ సమృద్ధి కేంద్రాలను జాతికి అంకితం చేయడం సంతోషకరమని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మన గ్రోమోర్ సెంటర్‌లో ఆయన రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం కిసాన్ క్రెడిట్ కార్డు, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, కృషి సంచాయ్ యోజన, ప్రధాన మంత్రి కుసుమ్ యోజన వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని దండగ కాదు.. పండుగ అని నిరూపించిన వ్యక్తి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకులు సుష్మా, సునీల్‌కుమార్, చరణ్, గంగయ్య, మన గ్రోమోర్ నిర్వాహకులు కృష్ణ, పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

వీరపునాయునిపల్లె : దేశంలోని రైతుల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయమని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గవేశ్వర యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కొమ్మద్ది రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారితో కలసి మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతులు సుబిక్షంగా ఉంటేనే దేశం సుబిక్షంగా ఉంటుందన్నదే మోదీ అభిమతమని తెలియజేశారు. బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు రామార్జున్‌రెడ్డి, మండల నాయకులు గంగాధర్ యాదవ్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని కిసాన్ సమృద్ధితో రైతులకు చేయూత

చెన్నూరు : దేశవ్యాప్తంగా రైతులకు మేలు చేకూర్చేందుకు గురువారం రాజస్థాన్ రాష్ట్రంలోని షికారు జిల్లాలో ప్రధాని కిసాన్ సమృద్ధి పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు మాదినేని రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం చెన్నూరు లోని రైతు భరోసా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన రైతు కిసాన్ సమృద్ధి పథకం ప్రారంభోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా మాదినేని రామసుబ్బయ్య మోదీ రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి. కిసాన్ మోర్చా కర వర్గ సభ్యులు టియర్ రామిరెడ్డి. మండల బీజేపీ అధ్యక్షులు రెడ్డి ప్రసాద్, నాయకులు రవికుమార్ ముని సుబ్బారెడ్డి. ప్రసాద్ రెడ్డి. పలువురు రైతులు పాల్గొన్నారు.

'కిసాన్' కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

పులివెందుల టౌన్ : రైతులందరూ కిసాన్ సమృద్ధి కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు మహేశ్వరరెడ్డి, భానుప్రకాష్, రాజశేఖర్‌లు సూచించారు. గురువారం పట్టణంలోని మన గ్రోమోర్ కేంద్రంలో కిసాన్ సమృద్ధి కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, శ్రీరాములు, మల్లికార్జునరెడ్డి, భాస్కర్‌రెడ్డి, విష్ణు, ఉపేంద్ర, గంగశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి వైద్య సేవలు అందించనున్నారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతో పాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు పైడికాలువలో గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : వల్లూరు మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జూదరుల అరెస్టు

చెన్నూరు : చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పాలెంపల్లి గ్రామ సమీపంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలు ఆవరణములో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న 26 మందిని అరెస్టు చేశామని కడప రూరల్ సీఐ అశోక్ రెడ్డి, చెన్నూరు ఎస్ఐ బి.శ్రీనివాసులరెడ్డి పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,02,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చెన్నూరు పోలీస్ స్టేషన్ పాలెంపల్లె పరిధిలో గల ఆర్కే ఫంక్షన్ హాల్ ఆవరణలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు.


ఆర్టీపీపీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



ఆర్టీపీపీలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆర్టీపీపీ జేఏసీ ఆధ్వర్యంలో గేటు బయట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతు వేతన సవరణ చేసి కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వీటితో పాటు పలు సమస్యలపై సమ్మె నోటీసును కూడా ఇచ్చామన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

ఓటమి భయంతోనే బాబు,కల్యాణ్ జిమ్మిక్కులు



వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్

పులివెందుల రూరల్ : ఓటమి భయంతోనే ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాన్ జిమ్మిక్కులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ విమర్శించారు. గురువారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వేలైన్ మంజూరు చేయించినందుకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి పులివెందుల ప్రాంత ప్రజలు రుణపడి ఉంటారన్నారు. వైఎస్సార్‌సీపీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా ప్రభుత్వం మీద బురద జల్లుతున్నారన్నారు.

బియ్యం పంపిణీ కేంద్రాలు ప్రారంభం



బియ్యం పంపిణీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : సబ్సిడీ జిలకర మసూర బియ్యం పంపిణీ కేంద్రాలను గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జిలకర మసూరు బియ్యం 26కేజీల బస్తా రూ.1650లు ఉండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మండి మర్చంట్ వారితో ఆర్డీఓ వెంకటేశులు మాట్లాడి వారి సహకారంతో గురువారం పులివెందులలోని సుజాత థియేటర్ సమీపంలో సబ్సిడీ జిలకర మసూరు బియ్యాన్ని అందించడం జరుగుతోందన్నారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి 10కిలోల చొప్పున కిలో రూ.48లతో ఇస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకముందు వారు మండి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, సభ్యులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే, కరీముల్లా, మండి మర్చంట్ సభ్యులు శ్రీహరి, మహేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

పులివెందుల టౌన్ : పట్టణంలోని మ్యాన్ హోళ్లు, మురికి కాలువల్లో మురికి నీటిలో పూడికలు నిల్వ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరుచేసే ప్రక్రియను తప్పక అమలు చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను వారు తనిఖీ చేశారు.

స్టేషన్‌లో మిషనరీని జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ, శిశు సంరక్షణపై అవగాహన



బాలింతకు సూచనలిస్తున్న ఏఎన్ఎంలు

చెన్నూరు: చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కేర్ క్యాంపెయిన్, నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఏఎన్ఎంలకు ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్, డాక్టర్ దినకర్ రెడ్డి మాట్లాడుతూ నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఏఎన్ఎంలకు తల్లి శిశు సంరక్షణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పద్ధతుల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాలలోని గర్భిణులకు పలు సూచనలు చేశారు. తల్లిపాల విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యత, టీకాల గురించి వారికివివరించారు. డాక్టర్ హరీష్, డాక్టర్ శిరీష , డాక్టర్ శివ శంకర్, డాక్టర్ సాగర్ కుమారి, నర్సింగ్ సూపరిం డెంట్ పద్మ పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో అర్హులందరికీ పథకాలు మంజూరవుతాయని ఎంపీడీఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలోని సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలో ఇళ్లు మంజూరయిన వారు త్వరితగతిన నిర్మించుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం 363 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డ్స్, కుల ధ్రువీకరణ పత్రం తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటరామిరెడ్డి ఎంపిటీసీ లక్ష్మీదేవి, సర్పంచ్ మజ్జారి నాగేశ్వరి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పథకాలు అందేలా చూడాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన సచివాలయ, శానిటేషన్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో సిటిజన్ ఫీడ్ ఇవ్వాలన్నారు. మలేరియా, డెంగీ జ్వరాల నివారణకు కృషి చేయాలన్నారు. అలాగే పారిశుధ్యం, తాగునీరు, ఇంటింటా చెత్త సేకరణ, మౌళిక సదుపాయాలపై పట్టణ ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : పట్టణంలోని రైతు భరోసా కేంద్రాలలో గురువారం వ్యవసాయ అధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు చిరు ధాన్యాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ నాగలక్ష్మి చిరు ధాన్యాలైన కొర్రలు, జొన్నలు, రాగులు సాగు చేయడంవల్ల పంట ఖర్చు తగ్గించుకుని మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. నీటి శాతం కూడా ఎక్కువ ఖర్చు కాకుండా సాగు చేసుకోవచ్చని వివరించారు. ప్రతి ఒక్క రైతు పంట నమోదు కచ్చితంగా చేయించుకోవాలని ఆమె తెలిపారు.

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురంలో ముద్దనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆత్మ సౌజన్యంతో ఆర్‌బీకే ఇన్‌చార్జిలు, రైతులకు చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ రామాంజులరెడ్డి చిరుధాన్యాలైన కొర్రలు, జొన్నలు, రాగులు, సజ్జలు తదితర పంటల ప్రాముఖ్యత గురించి తెలిపారు వ్యవసాయ మండలి సహాయ చైర్మన్ అరవిందనాథరెడ్డి, ఆత్మ బీటీఎం రవికుమార్, వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'పొలం బడి'పై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ప్రతి రైతును తన పొలానికి శాస్త్రవేత్తగా మార్చడం కోసమే ప్రభుత్వం పొలం బడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో పొలం బడి పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బ్యాలెట్ బాక్స్ పరీక్ష ఏర్పాటు చేసి రైతులకు నూతన పద్ధతులపై ఎంత మేరకు అవగాహన ఉందో తెలుసుకున్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులు అందజేశారు. ఏ పంటకు ఏ మేరకు ఎరువులు వినియోగించాలో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమం ద్వారా ప్రతి రైతు తన పొలానికి శాస్త్రవేత్తను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పంటల సాగు పాటించాల్సిన మెలకువలను, చేపట్టే సస్యరక్షణ చర్యలను, వచ్చే దిగుబడుల గురించి వివరించారు. వీపీఏలు మమత, మహేష్, వెంకట కృష్ణ, పొలం బడి రైతులు పాల్గొన్నారు.